ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
సోమవారం | 06 జులై , 2026 | పేజీలు : 3

## నూతన గృహప్రవేశంలో ఎమ్మెల్యే వేముల వీరేశం



**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన మల్లం ధనమ్మ, పాగుడల వెంకటేశంలు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం కమ్మలపల్లి మధు నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని అభినందనలు తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాల సొంతింటి కల సాకారం అవుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మునుగోడు నియోజకవర్గంలో ఒక్కరికీ కూడా

# కంటి సమస్యలు ఉండొద్దు

### కంటి శస్త్ర చికిత్సకు ఎంపికైన వారికి ఆత్మీయ భరోసా

### 15వ విడత ఉచిత కంటి వైద్య శిబిర ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి







**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ఏ ఒక్కరు కంటి సమస్యలతో బాధపడుద్దని ప్రతి ఒక్కరికి కంటి సమస్య లేకుండా చేయించే బాధ్యత నాదని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ పేరు మీద మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ఏ ఒక్కరు కంటి సమస్యలతో బాధపడోద్దనే ఆలోచనతో ఉచిత కంటి వైద్య శిబిరాలకు శ్రీకారం చుట్టారు. దాంట్లో భాగంగానే 15వ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని చౌటుప్పల్ మండలం చౌటుప్పల్ మున్సిపాలిటీ ప్రజలకు కలిపి చౌటుప్పల్‌లో నిర్వహించారు. ఈ 15వ విడత ఉచిత కంటి వైద్య శిబిరాన్ని రిబ్బన్ కటింగ్ చేసి తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ప్రారంభించారు. ఇప్పటివరకు 14 విడతలుగా ఈ ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి 10444 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, 2325 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్లు పూర్తి చేసి, 4557 మందికి కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. మునుగోడు ప్రజలకు మునుగోడులో నిర్వహించిన మొదటి విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 216 మందికి, రెండవ విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 108 మందికి, చండూర్ మున్సిపాలిటీ ప్రజలకు మునుగోడులో నిర్వహించిన మూడవ విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 129 మందికి, నాంపల్లి మండల ప్రజలకు నాంపల్లి మండల కేంద్రంలో 4 వ విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 229 మందికి, మర్రిగూడ మండల కేంద్రంలో నిర్వహించిన 5 వ విడత కంటి వైద్య శిబిరంలో 171 మందికి ,ప్రజలకు చండూరు మండలం బంగారిగడ్డలో నిర్వహించిన 6 వ విడత వైద్య శిబిరంలో 198 మందికి, గట్టుప్పల్ మండల కేంద్రంలో గట్టుప్పల్ మండల ప్రజలకు నిర్వహించిన 7 వ విడత వైద్య శిబిరంలో 65 మందికి, సంస్థాన్ నారాయణపురం మండలంలో నిర్వహించిన 8 వ విడత వైద్య శిబిరంలో 132 మందికి, చౌటుప్పల్ మున్సిపాలిటీలో నిర్వహించిన 9 వ విడత వైద్య శిబిరంలో 82 మందికి, చౌటుప్పల్ మండలంలో నిర్వహించిన 10 వ విడత వైద్య శిబిరంలో 160 మందికి, మునుగోడు లో మునుగోడు , గట్టుపల్ మండలాల ప్రజలకు నిర్వహించిన 11వ విడత వైద్య శిబిరంలో 257 మందికి, మునుగోడు క్యాంపు కార్యాలయం ఆవరణలో చండూరు మున్సిపాలిటీ చండూరు మండల ప్రజలకు నిర్వహించిన 12వ విడత వైద్య శిబిరంలో 223 మందికి, మునుగోడు క్యాంపు కార్యాలయ ఆవరణలో నాంపల్లి మండల ప్రజలకు నిర్వహించిన 13వ వైద్య శిబిరంలో 228 మందికి, మర్రిగూడ మండల కేంద్రంలో మర్రిగూడ మండల ప్రజలకు నిర్వహించిన 14వ విడత వైద్య శిబిరంలో 127 మందికి కంటి ఆపరేషన్లు పూర్తి చేశారు. ఈ శిబిరంలో 1210 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 28 మందికి పైగా ఆపరేషన్లకు ఎంపికయ్యారు. తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ఫినిక్స్ ఫౌండేషన్, శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఈ ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరాలు నిరంతర ప్రక్రియగా నిర్వహిస్తామని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బోయ దేవేందర్, పబ్బు రాజు గౌడ్, కాంగ్రెస్ నాయకులు ఆకుల ఇంద్రసేనారెడ్డి,మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజలు పాల్గొన్నారు.

## భక్తి, సేవలతో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

### ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం కేశవ నగర్ కాలనీలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో నిర్వహించిన శ్రీ రాములవారు, శ్రీ గణపతి స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ జరిగిన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పింది. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభ స్వాగతం పలికి ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. అనంతరం గ్రామ ప్రజలు, భక్తులతో కలిసి ఎమ్మెల్యే ప్రత్యేక దర్శనం చేసుకుని రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో దేవాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. గ్రామాల్లో ఇటువంటి ధార్మిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా యువతలో ఆధ్యాత్మిక చైతన్యం పెరుగుతుందని, సమాజంలో ఐక్యత, సోదరభావం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. దేవాలయాలు కేవలం పూజా స్థలాలు మాత్రమే కాకుండా ప్రజలను ఒక్క తాటిపైకి తీసుకువచ్చే సామాజిక కేంద్రాలుగా కూడా పనిచేస్తాయని చెప్పారు. అనంతరం నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. భక్తులకు స్వయంగా అన్నప్రసాదం అందజేసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**ప్రజాపక్షం/సూర్యాపేట (నూతనకల్) :** మైనింగ్ అధికారుల సూచనలతో ఎస్ఆర్ఓలు బాబు, రవి, రాంబాబు, లింగస్వామిలు ప్రభు త్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను ఆదివారం తుంగతుర్తి నియోజకవర్గంలోని నూతనకల్ మండలంలోని గుండ్లసింగారం పరిధిలో పట్టుకోవడం జరిగింది. అనంతరం అట్టి ఇసుక ట్రాక్టర్లను మండల పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.





## పాల సంఘం చైర్మన్‌ను సన్మానించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండలం ఉత్తటూర్ గ్రామ పాల సంఘం చైర్మన్గా నూతనంగా నియమితులైన ఎనుగుల వెంకట్ రెడ్డి ని ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి పాల సంఘాలు కీలక భూమిక పోషిస్తాయని, రైతులు మరియు పాల ఉత్పత్తిదారుల సంక్షేమం కోసం సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతన చైర్మన్ ఎనుగుల వెంకట రెడ్డి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి సంఘాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని అభినందనలు తెలిపారు.

## అంచలంచెలుగా ఎదిగిన మొక్క భిక్షపతి

**ప్రజాపక్షం/నడిగూడెం:** యుక్త వయసు నుండి రాజకీయాల్లోకి వచ్చి మూడు దశాబ్దాలుగా రాజకీయాల్లో కొనసాగుతున్న మొక్క భిక్షపతికి ఎట్టకేలకు మండల స్థాయి పదవి లభించింది. మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన మొక్క బిక్షపతి తన రాజకీమయ ప్రస్థానంలో అంచెలంచెలుగా ఎదిగి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమితులయ్యారు. 1995లో మండల యూత్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 2006లో ఎంపిటిసిగా పోటీ చేసి స్వల్ప మెజార్టీతో ఓడిపోయారు. అనంతరం 201218 మండల సోసైటీ డైరెక్టర్గా పనిచేశారు. 201924 సంవత్సరాల మద్య కాలంలో తన సహకారంతో భార్య లక్ష్మి వీణ గ్రామ సర్పంచ్‌గా సేవలించింంది ప్రజల మన్ననలను పొందారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా మొక్క బిక్షపతి నియోజక వర్గ నాయకులతో కలిసి రోడ్ల నిర్మాణం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని ప్రజల మన్ననలు పొందుతున్నారు.

## సరోజనమ్మ మృతి బాధాకరం

**ప్రజాపక్షం/నడిగూడెం:** మండలంలోని రామాపురం గ్రామ సర్పంచ్ బుత్కూరి వెంకటరెడ్డి తల్లి బుత్కూరి సరోజనమ్మ మృతి ఎంతో బాధకరమని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. శనివారం రాత్రి రామాపురంలోని సరోజనమ్మ మృత దేహనికి పూల మాలలువేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరమార్శించారు. ఆమె మృతి పట్ల కాంగ్రెస్ నాయకులు సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో పిసిసి డెలిగెట్ చింతకుంట్ల లక్ష్మి నారాయణరెడ్డి, కోదాడ మార్కెట్ కమిటి చైర్మన్ ఏపూరి తిరపతమ్మ సుధీర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మొక్క బిక్షపతి, సింగిల్ విండో చైర్మన్ కొల్లు రామారావు, మాజీ చైర్మన్ దేవబత్తిని సురేష్ ప్రసాద్, మాజీ జడ్పిటిసి బాణాల కవిత అబ్రహం, నడిగూడెం సర్పంచ్ దున్న శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇండ్ల పథకంతో సొంతింటి కల



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** ఇందిరమ్మ ఇండ్ల పథకంతో ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేరుతుందని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఆరెగూడెం గ్రామంలో రాచకొండ ధనమ్మ శ్రీనివాస్ నూతన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత బిఆర్ఎస్ పాలనలో ఇల్లు లేని నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో నియోజక వర్గంలో ఇల్లు లేని ప్రతి ఒక్కరికి రూ.5లక్షలు మంజూరు చేయించి సొంతింటి కల సాకారం చేయిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యతోపాటు ఉపాధి నైపుణ్య శిక్షణ



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ వర్సిటి విద్యార్థులకు విద్యతోపాటు ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు పొందటానికి నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని ఓపెన్ వర్సిటి విద్యార్థి సేవా విభాగం డైరెక్టర్ వై. వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్.వి. డిగ్రీ కళాశాల సార్వత్రిక అధ్యయన కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థతో అవగాహన ఒప్పందం ప్రకారం విద్యార్థులకు బేసిక్ కంప్యూటర్స్, జిఎస్‌టి, అసిస్టెంట్ అకౌంట్, సోలార్ టెక్నిషియన్, సిసి కెమెరాల వంటి విభాగాలలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. అదేవిధంగా మహిళ విద్యార్థులకు టైలరింగ్ శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. బిఎస్‌సి ఎంపిసి, బిజడ్‌సి, బికాం కంప్యూటర్ విద్యార్థులకు సైన్స్ ప్రాక్టికల్స్ కేంద్రాన్ని ఈ సంవత్సరం నుండి కళాశాలలో ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. కోయ, చెంచు, ఆదివాసి గిరిజన విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తున్నామని అన్నారు. పోటీ పరీక్షలకు ఉపయోగపడే విధంగా అనుభవజ్ఞులైన సీనియర్ ప్రొఫెసర్లచే స్టడి మెటిరియల్ తయారు చేసి విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. ఓపెన్ వర్సిటిలో అడ్మిషన్ పొందడానికి ఆగష్టు 7 చివరి తేది అని ఇతర వివరాల కోసం బిఆర్ఏఓయు ఆన్‌లైన్ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాల కోసం ఎస్‌వి కళాశాల స్టడి సెంటర్‌ను సంప్రదించాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ కెప్టెన్ ప్రొఫెసర్ వి. వెంకటేషులు మాట్లాడుతూ ప్రాక్టికల్స్ పరీక్షల నిమిత్తం నల్లగొండ పట్టణానికి వెళ్లుటకు ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు కళాశాల సార్వత్రిక కేంద్రంలో ప్రాక్టికల్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. కిషోర్ రెడ్డి, డాక్టర్ అనిల్, మల్లయ్య, సార్వత్రిక అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ ఎన్ఎస్ఆర్ శాస్త్రి, క్లర్క్ ప్రసాద్, కౌన్సిలర్లు బుక్క ఉపేందర్, వడ్డానం శ్రీనివాస్, మధు, సుఖేష్ పాల్గొన్నారు.

## నందిపాడు బైపాస్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణ పరిధిలోని నందిపాడు బైపాస్ రోడ్డు కూడలి వద్ద రోజురోజుకూ వాహనాల వేగం పెరిగి నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్న తరుణంలో, అక్కడ మంజూరైన ఫ్లైఓవర్ నిర్మాణ పనులను సంబంధిత అధికారులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలి. ఆదివారం ఉదయం నందిపాడు క్రాసింగ్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందడంతో పాటు ఆమె భర్త ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న సంఘటనపై బంజారా సంఘం నాయకులు దశరథ నాయక్, రామచందర్ నాయక్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన నందిపాడు క్రాసింగ్ ఏరియాను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అక్కడ బాటసారుల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడారు.ఈ సందర్భంగా బంజారా సంఘం నాయకులు దశరథ నాయక్, రామచందర్ నాయక్ మాట్లాడుతూ నందిపాడు కూడలి ప్రమాదకరమైన బ్లాక్ స్పాట్‌గా మారినప్పటికీ నివారణ చర్యలు శూన్యమన్నారు. ఇప్పటికైనా ఫ్లైఓవర్ నిర్మాణ పనులు మొదలుపెట్టి ప్రజల ప్రాణాలు కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాని నాయక్, బంటు వెంకటేశ్వర్లు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వరనీరాజనం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నవ్య కళానికేతన ఆధ్వర్యంలో మిర్యాలగూడలోని స్విమింగ్ పూల్ శ్రీనివాస కల్చర్ స్టూడియోలో ఆదివారం నిర్వహించిన స్వరనీరాజన సంగీత కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సంగీతాభిమానులు, కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంగీత విభావరిని ఆస్వాదించారు. కార్యక్రమంలో పలువురు గాయనీ గాయకులు శ్రీ రామకవచం రమేష్ శర్మ, కందుకూరి సుదర్శన్, తారక రామం, బాచిమంచి, రామరంగారావు, శివకోటి శేఖర్,ఆదిమళ్ల మౌనిక, ఊర్మిళ, శీలం జ్యోతిలు తమ మధుర గానంతో ప్రేక్షకులను అలరించగా, సంగీత ప్రియులు వారిని ఘనంగా అభినందించారు. ముఖ్య అతిధులు కర్నాటి రమేష్,రేపాల అంతయ్య, చీదేళ్ల ఓంప్రకాష్, సాయి కుమార్ యాదవ్ లు కళాకారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కళాకారులు, సంగీతాభిమానులు, ఆహ్వానితులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## కార్టూన్ ద్వారా ఉపాధ్యాయుని నిరసన

**ప్రజాపక్షం/రామన్నపేట :** టీచర్లకు మధ్యాహ్న భోజనం,బ్రేక్ ఫాస్ట్ అంటూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల ప్రజల్లో విద్యార్థుల్లో చులకన అవుతున్నామని రామన్నపేటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పాల్వంచ హరికిషన్ కార్టూన్ ద్వారా ప్రభుత్వానికి తెలుపుతూ తన ఆవేదనను, నిరసనను వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం కావాలని టీచర్లు ఎవ్వరూ ఆడగ లేదని, అడిగినవి పిఆర్‌సి, డిఏలు మాత్రమేనని అవి ఇవ్వకుండా మాకు అవసరం లేదని, మధ్యాహ్న భోజనం బ్రేక్ ఫాస్ట్ ఇవ్వడమేంటని పాల్వంచ హరికిషన్ అన్నారు. ఉపాధ్యాయులను ప్రజల్లో చులకన చేసే నిర్ణయాలు తీసుకోవద్దని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ నిర్ణయం ప్రజల్లో, విద్యార్థుల్లో చులకన అయ్యే విధంగా ఉందని ఆయన తెలిపారు. ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇవ్వవలసిన 6 పెండింగ్ డిఏలను, పిఆర్‌సి సత్వరమే అందించాలని, దయచేసి ప్రజల్లో ఉపాధ్యాయులను చులకన చేయొద్దని అది వ్యవస్థకు మంచిది కాదని ప్రభుత్వానికి సూచించారు.

## పెంపుడు జంతువులకు ఉచిత టీకాలు

**ప్రజాపక్షం/కోదాడ:** ప్రపంచ సాంక్రమిక వ్యాధుల నివారణ దినోత్సవం సందర్భంగా నేడు సోమవారం ఉదయం పది గంటలకు కోదాడ పట్టణ ప్రాంతీయ పశువైద్యశాలలో మూడు మాసాలు దాటిన కుక్కల పిల్లలకు ఉచిత రేబిస్ నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించబడుతుందని అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.పెంటయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు, వైస్ చైర్మన్ మల్లీశ్వరి లు హాజరవుతున్నట్లు తెలిపారు. పెంపుడు కుక్కల పిల్లల యాజమానులు తమ పెంపుడు జీవాలను తీసుకుని రేబిస టీకాలు వేయించుకోవాలని కోరారు.

## సొంత పార్టీలో లొల్లి...

### నాయకుల అసమ్మతి వర్గపోరు

### రెండు గంటల పాటు రోడ్డుపైనే బైటాయించిన నాయకులు

**ప్రజాపక్షం/అర్వపల్లి :** తుంగతుర్తి నియోజక వర్గంలోని 9 మండలాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులను ఎమ్మెల్యే ఏకపక్షంగా నిర్ణయం తీసుకొని ఎన్నిక చేశారని, సీనియర్లకు అవకాశం ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సొంత పార్టీలో లొల్లి పెట్టుకున్నారు. 9 మండలాల్లో నూతనంగా నియామకం చేసిన మండల అధ్యక్షుల ఎన్నికలను వెంటనే రద్దు చేయాలని కోరుతూ నాయకుల అసమ్మతి వర్గపోరుతో రెండు గంటల పాటు జనగాం సూర్యాపేట రహదారిపై రోడ్డుపైనే బైటాయించారు. మాజీ జిల్లా ఉపాధ్యక్షులు ధరూరి యోగానంద చార్యులు ఆధ్వర్యంలో కొమ్మాల గ్రామంలో అసమ్మతి వర్గీయులు దామోదర్ రెడ్డి వర్గం పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు మాజీ జడ్పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సేవ చేస్తున్న తమను పూర్తిగా మర్చిపోయి తన గెలుపు కోసం కూడా పని చేయని నాయకులను నేడు మండల పార్టీ అధ్యక్షులుగా నియామకం చేశారని ఆరోపించారు. ప్రస్తుతం ఎన్నుకున్న మండల అధ్యక్షులను వెంటనే రద్దు చేసి కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్న సీనియర్ నాయకులను ఎన్నిక చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే గాంధీ భవన్ వరకు వెళ్లి పోరాటం చేస్తామన్నారు. అంతకు ముందు రోడ్డుపై నాయకులు రెండు గంటల పాటు ధర్నా చేయగా సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో నాగారం సిఐ నాగేశ్వరరావు, అర్వపల్లి, నాగారం, తుంగతుర్తి ఎస్ఐలు పోలీస్ సిబ్బంది ఎటువంటి ఆవాంఛనీయ సంఘటన జరగకుండా బందోబస్తుతో ధర్నాను విరమింప చేశారు.



## సరోజనమ్మకు నివాళులు

ప్రజాపక్షం/నడిగూడెం: మండలంలోని రామాపురం సర్పంచ్ బుత్కూరి వెంకటరెడ్డి మాతృమూర్తి సరోజ నమ్మ మరణించడంతో ఆమె మృతదేహానికి విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు గుండు అనంతరా ములు, ఎండి ఖలీల్ అహ్మద్, లావూరి బాలాజీనా యక్ పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం



ప్రజాపక్షం/గుండాల; యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం అనంతారం గ్రామానికి చెందిన అంగడి రాజు ఇటీవల మరణించడంతో మానవ సేవే మాధవ సేవా అనే నినాదంతో ముందుకు వెళుతున్న మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ చైర్మన్ మబ్బు మహేష్ ఆదివారం రాజు కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపి వారి కుటుంబానికి ఆర్థిక సాయంగా రూ. 5016లను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, నర్సింహా, ఉప్పలయ్య, నవీన్, వెంకటేష్, లక్ష్మీ నారాయణ, రమేష్, మహేష్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఉచిత టీకాలు

ప్రజాపక్షం/కోదాడ రూరల్ : ప్రపంచ సాంక్రమిక వ్యాధుల నివారణ దినోత్సవం (జూనోసిస్ డే) సంద ర్భంగా జులై 6 (సోమవారం) కోదాడ పట్టణ ప్రాంతీయ పశువైద్యశాలలో మూడు మాసాలు దాటిన కుక్కల పిల్లలకు ఉచిత రేబిస్ నివారణ టీకాలు కార్య క్రమం నిర్వహించబడుతుందని కోదాడ ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి. పెంటయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, స్థానిక కౌన్సిలర్లు ముఖ్య అతిథులుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పట్టణంలోని పెంపుడు కుక్కలు, పిల్లుల యజమా నులు తమ పెంపుడు జీవాలకు రేబిస్ నివారణ టీకాలు వేయించుకొని వాటిని రక్షించుకుంటూ తాము కూడా రేబిస్ మహమ్మారికి బలికాకుండా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## వివాహ శుభకార్యానికి గ్రామ పెద్దల సహకారం

ప్రజాపక్షం/మునుగోడు:మండలంలోని కోతులారం గ్రామానికి చెందిన ఏర్పుల అన్నయ్య,జయమ్మ దంపతుల కుమార్తె మానస వివాహానికి గ్రామ పెద్దలు,యువకులు తమ సామాజిక బాధ్యతగా ముందుకు వచ్చి రూ.70,296 ఆర్థిక సహాయం అందించారు.చౌటుప్పల్‌లోని ఫంక్షన్ హాల్‌లో జరిగిన వివాహ వేడుకలో గ్రామానికి చెందిన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా నగదు సహాయాన్ని వధువు కుటుంబానికి అందజేశారు. గ్రామస్తుల సహకారంతో నిరుపేద కుటుంబంలో వివాహ వేడుక ఆనందంగా, ఘనంగా జరగడం సంతోషకరమని పేర్కొన్నారు.



## ఘనంగా మెగా ఉచిత వైద్య శిబిరం



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : సమాజంలో పేద,మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ నల్లగొండ జిల్లా విభాగం ఆధ్వర్యంలో ఆది వారం భారీ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిం చారు.జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో గల విశ్వకర్మ భవనంలో, నల్గొండలోని ప్రముఖ సురక్ష ఆసుపత్రి సౌజన్యంతో ఈ మెగా ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది.ఈ శిబిరాన్ని విశ్వబ్రా హ్మణ సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు దాసోజు యాద గిరి చారి,ప్రధాన కార్యదర్శి పెందుట సోములు ముఖ్య అతిథులుగా హాజరై,జ్యోతి ప్రజ్వలన చేసి అధి కారికంగా ప్రారంభించి మాట్లాడుతూ సమాజ సేవలో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతోనే వివిధ విభాగాల నిపుణులైన డాక్టర్లతో ఈ ఉచిత వైద్య శిబి రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈకార్యక్ర మంలో విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ గౌరవ అధ్యక్షులు శ్రీపాద కృష్ణమాచారి,మాజీ గౌరవ అధ్యక్షులు కొండోజు కృష్ణమాచారి,శిబిరం నిర్వహణ కమిటీ కన్వీనర్ కటక వెంకటాచారి,తరునోజు భీష్మా చారి,భౌరోజు రాఘవాచారి,దాసోజు బ్రహ్మచారి పందిళ్ళపల్లి బ్రహ్మచారి,పోలోజు శ్రీనివాసచారి దేవు లపల్లి వెంకటాచారి,కంచనపల్లి షణ్ముఖ చారి తదిత రులు పాల్గొన్నారు.

## దీనా విజ్ఞాన మందిర్‌కు స్వర్ణోత్సవ వేడుకలు



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : పట్టణంలోని ప్రముఖ విద్యాసంస్థ దీనా విజ్ఞాన మందిర్ స్థాపించి 50 సంవ త్సరాలు పూర్తైన సందర్భంగా ఈ నెల 19న స్వర్ణో త్సవ (గోల్డెన్ జూబ్లీ)వేడుకలను ఘనంగా నిర్వహించ నున్నట్లు సంస్థ కరస్పాండెంట్ పెరిక సంహిత రాణి,గోల్డెన్ జూబ్లీ వేడుకల ఆర్గనైజింగ్ కమిటీ కన్వీ నర్ నల్లా అమర్ తెలిపారు.దీనా విజ్ఞాన మందిర్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డులో ఉన్న ఎంపి బేగ్ ఫంక్షన్ హాల్లో ఈ నెల 19న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వేడుకలు నిర్వహించనున్నట్లు వెల్లడిం చారు.ఈ సందర్భంగా దీనా విజ్ఞాన మందిర్‌లో చది విన అన్ని బ్యాచ్‌ల మాజీ విద్యార్థులు హాజరై స్వర్ణో త్సవ వేడుకలను విజయవంతం చేయాలని పిలుపుని చ్చారు.పెరిక సంహిత రాణి మాట్లాడుతూ 1976లో పెరిక రాజారత్నం,దీనా రాణిలు దీనా రాణి ఆకాంక్ష మేరకు దీనా విజ్ఞాన మందిర్‌ను స్థాపించారని తెలి పారు. మీడియా సమావేశంలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు సాబేర్,మహమ్మద్ అబ్దుల్ సమద్,మహ మ్మద్ రిజ్వాన్,మహమ్మద్ ఫిరోజ్,వహీద్, ప్రవీణ్, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.



## మంచినీటి బోరు మోటర్ ప్రారంభం

ప్రజాపక్షం/రామన్నపేట : వెల్లంకి గ్రామం 4వ వార్డులో మాధవ రెడ్డి విగ్రహం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన మంచినీటి బోరు మోటర్‌ను ఆదివారం గ్రామ సర్పంచ్ ఈడెం రాధా శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 4వ వార్డు మెంబర్ సండ్ర లింగయ్య, గ్రామ పెద్దలు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. 4వ వార్డు ప్రజలకు తాగునీటి ఇబ్బంది తీర్చేందుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఈ బోరు మోటర్ ను ఏర్పాటు చేశామని సర్పంచ్ తెలిపారు.



## గృహ ప్రవేశం

ప్రజాపక్షం/చండూరు: తెలంగాణలోని ఇంది రమ్మ ఇండ్ల పథకం ఇల్లు లేని ఎన్నో కుటుంబా లకు సంతోషాన్ని కలిగిస్తుందని చండూరు మున్సి పాలిటీ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు అన్నారు. చండూరు మున్సిపాలిటీలోని 8వ వార్డుకు చెం దిన గండూరు నగేష్ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ తో పాటు కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ భూతరాజు దశరథ , కౌన్సిల్ సభ్యులు బుషిపాక వాసు, కోఆప్షన్ సభ్యులు చంద్రకళమారయ్య పాల్గొన్నారు.

## ఇందిరమ్మ గృహప్రవేశం

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : పోచంపల్లి మండలం జలాల్ పూర్ గ్రామంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో నిర్మించు కున్న పున్న లావణ్య నరేష్ నేత ఇందిరమ్మ నూతన గృహప్రవేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఉప్పునూతల వెంక టేష్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయ కులు జలాల్ పూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుండ్ల మహేష్ ముదిరాజ్, పాలకూర్ల ఆగయ్య గౌడ్, ఆర్‌టిఐ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ పాల్గొన్నారు.



## విద్యుత్ షాక్‌తో ముర్రా జాతి గేదె మృతి

ప్రజాపక్షం/రామన్నపేట : మండలంలోని జనం పల్లి గ్రామానికి చెందిన చలమల్ల లింగారెడ్డి అనే రైతు చెందిన ముర్ర జాతి గేదె శనివారం రాత్రి విద్యుత్ షాక్ గురై మృతి చెందింది. సుమారు రెండు లక్షల విలువగల గేదె మృతి చెందడంతో బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు లింగారెడ్డి కోరారు.





## రూ.2.20 లక్షల ఎల్‌ఓసి అందజేత

ప్రజాపక్షం/నందికొండ: ఆర్థిక ఇబ్బందులతో చికిత్స కొనసాగి స్తున్న అనారోగ్య బాధితుడికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.2.20 లక్షల ఎల్‌ఓసీ చెక్కును నల్లగొండ జిల్లా ఎమ్మెల్సీ ఎం.సి. కోటిరెడ్డి ఆదివారం అందజేశారు.నందికొండ మున్సిపాలిటీ హిల్ కాలనీ 5వ వార్డుకు చెందిన షేక్ షరీఫ్ హైదరా బాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్సీ,ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.2 లక్షల 20 వేల విలువైన ఎల్‌ఓసీ మంజూర య్యేలా చర్యలు తీసుకున్నారు.అనంతరం హిల్ కాలనీలోని లబ్ధిదా రుడి నివాసానికి వెళ్లిన ఎమ్మెల్సీ ఎం.సి. కోటిరెడ్డి, పార్టీ నాయ కులు, కార్యకర్తల సమక్షంలో ఎల్‌ఓసీ చెక్కును కుటుంబ సభ్యు లకు అందజేశారు. 8వ వార్డు కౌన్సిలర్ నకిరేకంటి రమణ సైదులు,మాజీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ రమేష్ ఉపాల్గొన్నారు.

## అరుదైన దవడ ఎముక ఇంప్లాంట్ శస్త్రచికిత్స



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : పట్టణంలోని డీవీకే రోడ్డులో ఉన్న శ్రీ సత్య డెంటల్ అండ్ అనుస్రీ మెడికల్ హాస్పిటల్‌లో అరుదైన దవడ ఎముక చెంప ఎముక ఆధారిత ఇంప్లాంట్ శస్త్రచికిత్స విజ యవంతంగా నిర్వహించారు.ఈక్లిష్టమైన శస్త్రచికిత్సను డాక్టర్ అర వింద్ నేతృత్వంలోని వైద్య బృందం పూర్తి చేసింది.సంబంధిత రోగి గతంలో అనేక ఆసుపత్రులను సంప్రదించినప్పటికీ,ఈతరహా శస్త్రచి కిత్స చేయడం సాధ్యం కాదని పలువురు వైద్యులు సూచించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.అనంతరం శ్రీసత్య డెంటల్ అండ్ అనుస్రీ మెడికల్ హాస్పిటల్‌ను ఆశ్రయించగా,వైద్యులు అవసరమైన పరీక్షలు నిర్వహించి చెంప ఎముక ఆధారంగా ప్రత్యేక ఇంప్లాం ట్లను అమర్చి శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ తుల అరవింద్ రెడ్డి,డాక్టర్ సుమన్ కృష్ణ,డాక్టర్ నందిని తదితర వైద్యులు పాల్గొన్నారు.

## ముత్యంరాజు గురుస్వామికి సన్మానం



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికైన రంగు ముత్యం రాజు గురుస్వామిని విజయవాడ నగరంలో ఆదివారం జరిగిన అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సమావేశంలో కమిటీ సభ్యులు ఘనంగా సన్మా నించారు. అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ జాతీయ నాయకులు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలో ధర్మప్రచార సభ ద్వారా ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అయ్యప్ప తత్వం భక్తుల చేరువకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సన్మా న కార్యక్రమంలో నాయకులు బెల్లం హరిప్రసాద్, రవి రాజు, శంక రాచారి, జయచంద్ర, లంకబాబు, టివి పుల్లంరాజు, దుశెట్టి భాస్కర్, భయానా సంతోష్, ఇస్తావత్ నగేష్ పాల్గొన్నారు.

## సర్ అవగాహన కార్యక్రమం

ప్రజాపక్షం/చింతలపాలెం : మండలంలోని ఎర్రకుంట తండ గ్రామంలో నిర్వహించిన సర్ అవగాహన కార్యక్రమంలో బిఆర్ఎస్ హుజూర్‌నగర్ నాయకులు పిల్లుట్ల రఘు పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ సర్ ప్రక్రియపై ఎలాంటి సందేహాలు ఉన్నా ప్రజలు సంబంధిత బీఎల్ఓ, పార్టీ నాయకులను సంప్రదించి అవసరమైన సూచనలు, సహాయం పొందాలని కోరారు.